30న సాలూరులో గ్రీవెన్స్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను ఈ నెల 30న సాలూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాలూరు ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను సాలూరులో సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ సాలూరులో జరిగే పిజిఆర్ఎస్‌కు హాజరుకావాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ అనంతరం శంబర జాతరపై సంబంధించిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

- గ్రానైట్ తవ్వకాల అనుమతుల రద్దు కోసం ఉధృత పోరాటం
- బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ
- కోరి గ్రామంలో పోలీసుల బెదిరింపులను ఖాతరు చేయకుండా విస్తృత సమావేశం
- త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటన

ప్రాణాలర్పించైనా.. కొండను కాపాడుకుంటాం

పాదయాత్రగా వస్తున్న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బడిదేవరకొండ ప్రజలందరికీ అండదండని, అదే గిరిజనుల జీవనాధారమని, కొండ తవ్వకాల లైసెన్స్ రద్దుకై ప్రాణాలర్పించైన కొండను కాపాడుకుంటామని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు, గిరిజనులు ముక్తకంఠంతో నినదించారు. శనివారం పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ కోరి గ్రామం వద్ద బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొండ గ్రానైట్ లైసెన్స్ రద్దుకై విస్తృత ప్రజా సమావేశం నిర్వహించారు. మొదటగా తానవలస గ్రామం నుండి కోరి గ్రామం వరకు గిరిజనులందరూ సుమారుగా మూడు కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. సమావేశం ప్రారంభ సందర్భంలో గ్రామాల నుండి వస్తున్న ప్రజలకు రూరల్ ఎస్ఐ సంతోషి కుమారి అనుమతి లేని ఈ సమావేశానికి హాజరైతే కేసులు బనాయిస్తామని బెదిరించడంతో నాయకులకు, ఎస్ఐకు మధ్య కొంతసేపు వాగ్వివాదం నెలకొంది. అయినా పోలీసుల బెదిరింపులను ఖాతారు చేయకుండా నాయకుల పిలుపుతో ప్రజలంతా హాజరయ్యారు.

గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

అనంతరం అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఐర్ల రాష్ట్ర నాయకులు పి.సంగం, సిపిఐ నాయకులు జీవ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బంటు దాసు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాలమిట్ట రాము తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వం ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా బడిదేవర కొండ క్వారీ పనులు చేపడుతోందని, దీన్ని ప్రజలందరూ ఎదుర్కోవడం ద్వారానే కొండను కాపాడుకోగలమని అన్నారు. వర్షాలు కురిపించి.. పాడిపంటలు పండించి మనల్ని ఆదుకొనే బడిదేవరమ్మ గుండె కోసేస్తుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ, ఫారెస్ట్ ఉమ్మడి సర్వేలో అది రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోనే ఉందని హైలెవల్ కమిటీ నిర్ధారించిన తరువాత ఇచ్చిన లైసెన్స్‌రె ప్రభుత్వమే రద్దు చేసిందని, ఇపుడు అది గయ్యాలి కొండగా తప్పుడు రాతలు రాయడం ప్రజలను, గిరిజనులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అటవీశాఖ ఇప్పటికీ బడిదేవర కొండ తమదే అంటున్నదని, బడిదేవర కొండను కోసేస్తున్నా ఎందుకు అడ్డుకోదని, కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. ఈ కొండపైనే 20 ఏళ్ల క్రితమే గిరిజనులకు రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు కలిసి పోడుపట్టాలు ఇచ్చాయని, ఒకేచోట ఒకరికి పట్టా ఇంకొకరికి గ్రానైట్ లైసెన్స్ ఎలా ఇచ్చారని అన్నారు. ప్రజల జీవన సంపదలను లెక్కచేయకుండా టిడిపి ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు లైసెన్సులను జారీ చేస్తే దానిని అడ్డుకునే గిరిజన, ప్రజలపై పోలీసులను ఉసిగొలిపి ముందస్తు ఈ సమావేశానికి ఎటువంటి సమాచారం లేదని రూరల్ పోలీసులు వాట్సాప్‌ల ద్వారా హెచ్చరిక నోటీసులు పంపడం అమానుషమని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి బెదిరింపులను విడనాడాలని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి బడిదేవరకొండ తవ్వకాలకు ఇచ్చిన లైసెన్సులను రద్దు చేయాలని, అనుమతులు జారీ చేసిన వెంకటరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు ప్రణాళికను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తొక్కుడువలస, తానవలస, సంగంవలస, కోరి, గంగాపురం, రావికోన, ఎమ్మార్ నగర్ గ్రామాల నుండి యువతీ యువకులు, గిరిజనులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వద్ద పోలీసుల పహారా

దక్షిణ భారతదేశంలో భామిని బ్లాక్ టాప్

నీతి అయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో మొదటి స్థానం

ప్రజాశక్తి-పార్వతీపురం

నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో జిల్లాలోని భామిని ఆశావహ (ఆస్పిరేషనల్) బ్లాక్ దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. భామిని ఆశావహ బ్లాక్ సూచికల్లో మంచి ర్యాంకింగ్‌ను సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని 15 బ్లాకులు, జోన్ - 3 కింద ఉన్న దక్షిణ భారతదేశంలోని (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక) రాష్ట్రాల్లోని దాదాపు వంద బ్లాకుల్లో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ ప్రతి త్రైమాసికంలో సూచికల సాధనను విశ్లేషిస్తుంది. అత్యుత్తమ ఫలితాలు సాధించిన బ్లాకులను ప్రకటిస్తుంది. ఈ త్రైమాసికంలో భామిని ఆస్పిరేషనల్ బ్లాక్ ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉంది ప్రోత్సాహకంగా రూ.1.50 కోట్లు పొందింది.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్య, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, జీవనోపాధి, అభివృద్ధి, మౌలిక సదుపాయాల విభాగాల్లో నీతి ఆయోగ్ సూచికలు ఉన్నాయి. అందులో భాగంగా పదో తరగతి పరీక్షల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించడం, వంద శాతం భూ ఆరోగ్య కార్డుల పంపిణీ, 20 గ్రామ పంచాయతీలను టిబి ముక్త్ భారత్‌లో భాగంగా టిబి రహితంగా ప్రకటించడం, బత్తిలి, బాలేరు, భామిని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులను వంద శాతం గుర్తించడం - నమోదు చేయడం, సహజ వ్యవసాయంలో ప్రోత్సాహం, పంట మార్పిడి, వంద శాతం సబ్సిడీపై చిరు ధాన్యాలు విత్తనాల పంపిణీ, మొక్కజొన్న విస్తీర్ణం 9 ఎకరాల నుంచి 250 ఎకరాల విస్తీర్ణానికి పెంచడం వంటి అంశాలలో భామిని బ్లాక్ మంచి ప్రగతి కనబరిచింది.

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ 2023 మార్చిలో ప్రారంభమైంది. పార్వతీపురం మన్యం జిల్లా కూడా ఆస్పిరేషనల్ జిల్లాగా ప్రకటించడమే కాకుండా, నీతి ఆయోగ్ సూచికలలో 2023 సంవత్సరంలో అగ్రస్థానంలో నిలిచి రూ.3.50 కోట్ల ప్రోత్సాహకాన్ని పొందింది. ఈ ఘనత సాధించిన అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అభినందించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సూచీలను అనుసరించి ప్రోత్సాహక నిధులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే స్ఫూర్తితో బ్లాకు అభివృద్ధిలో ర్యాంకును కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. రక్తహీనత నియంత్రణను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బ్లాక్ కోఆర్డినేటర్ కె.మహేశ్వర్‌రావు, జిల్లా ప్లానింగ్ అధికారి పి.వీరరాజు పాల్గొన్నారు.

ఇసుక టెండర్లు ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో మూడు ఇసుక రీచులకు (భామిని మండలం నేరడి, పసుకుడి, పాలకొండ మండలం చినమంగళాపురం) టెండర్లు ప్రారంభమయ్యాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక సమక్షంలో శనివారం కలెక్టరేట్లో టెండర్ డబ్బాలకు సీల్ వేయించారు. టెండర్లు వేసేందుకు జనవరి 3వ తేదీ అఖరని, ఆసక్తి గల టెండరుదారులు రూ.10 వేల డీడీని తీసి కలెక్టర్ కార్యాలయ మొదటి అంతస్తులో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌లో టెండర్లు వేయవచ్చని జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ, గనుల శాఖ అధికారి జి.శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ కార్యక్రమాలకు ఎక్సైజ్ అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎక్సైజ్ శాఖ నుంచి ఈవెంట్ పర్మిట్ తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర, సంక్రాంతి పండగ సందర్భంగా లిక్కర్ పార్టీ నిర్వహిస్తే ముందుగానే ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుండా లిక్కర్ సరఫరా జరిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రతి ఇంటికీ తాగునీరు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రగతిలో ఉన్న జెజెఎం పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో కలెక్టర్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెజెఎం పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, ఇందుకోసం దగ్గరలో ఉన్న నీటి వనరుల సౌలభ్యాన్ని చూసుకోవాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎంపిడిఒలు.. సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లతో సమీక్షించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారం ప్రగతి కనిపించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో తోటపల్లి, వెంగళరాయసాగర్ ద్వారా అదనంగా తాగునీటిని అందించేందుకు డిపిఆర్‌ను రూపొందించాలన్నారు. రానున్న 30 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలు చేయాలని కలెక్టర్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. అంగన్వాడీ సొంత భవనాలకు లోపల, వెలుపల నాణ్యమైన రంగులు వేసి కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దాలని, బోర్డును ఏర్పాటుచేయాలని, ఈ పనులన్నీ సంక్రాంతిలోగా పూర్తికావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పలనాయుడు, భూగర్భ జలవనరుల శాఖ అధికారి ఎ.రాజశేఖర్ రెడ్డి, ఎంపిడిఒలు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

3 నెలల్లో ఆస్పత్రి సిద్ధం

మంత్రి సంధ్యారాణి • గర్భిణుల వెయిటింగ్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి-సాలూరు

మూడు నెలల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తవుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. శనివారం పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణాన్ని గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గిరిజన, పేద ప్రజల చిరకాల కల వంద పడకల ఆస్పత్రి నిర్మాణమని తెలిపారు. ఎక్కువ పంచాయతీలు ఉన్న సాలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో ఆపద వస్తే సాలూరులో 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉందన్నారు. అత్యవసర పరిస్థితులలో విజయనగరం, విశాఖపట్నంలో పెద్దాస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. మార్గం మధ్యలో రోగులు మరణించారనే వార్త తెలిసినప్పుడు చాలా బాధగా ఉంటోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లినట్లు వివరించారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ తక్షణమే రూ.4 కోట్లు ఆస్పత్రి నిర్మాణానికి మంజూరు చేశారని వెల్లడించారు. దీంతో శరవేగంతో పనులు పునఃప్రారంభించినట్లు వివరించారు. గర్భిణుల కోసం బర్త్ వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేసి, డెలివరీ అయ్యే వరకు ఆస్పత్రిలోనే ఉంచి, పౌష్టికాహారం అందించి, ప్రసూతి తరువాత అంబులెన్సులో ఇంటికి పంపిస్తామని తెలిపారు.

తొలుత ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా కౌన్సిలర్ వైకుంఠపు హర్షవర్ధన్, కారేపు చంద్రరావు, కాళ్ల శ్రీనివాసరావును కమిటీ చైర్‌పర్సన్ హోదాలో ఆమె నియమించారు. రూ.10.80 లక్షలతో నిర్మించిన గర్భిణుల బర్త్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.వి.ఎస్ పద్మావతి, సాలూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.కె.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

జగన్ అవినీతితోనే విద్యుత్తు భారాలు

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అవినీతి వల్లే ప్రజలపై విద్యుత్తు భారాలు పడ్డాయని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో విద్యుత్తు ఛార్జీలు పెంచి ఇప్పుడు మీరే ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్తు భారాలు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, నాయకులు కొనిస మన్మథరావు, బంకుపల్లి రామారావు, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

సీతంపేట : విద్యుత్తు ఛార్జీల పెంపు పాపం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఒక ప్రకటనలో విమర్శించారు. వైసిపి హయాంలో 10 సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేశారని చెప్పారు. అధికారం కోల్పోయాక విద్యుత్తు భారాలపై వైసిపి ధర్నా చేపట్టడం ప్రజలను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

15 గ్రామాల్లో పీసా ఎన్నికలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని 15 గ్రామాల్లో శనివారం పీసా ఎన్నికలు నిర్వహించారు. 14 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. దాసుపురం గ్రామంలో ఎన్నిక నిర్వహించినట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం 17 గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు చెందిన మంత్రి, అధికార పార్టీకి చెందిన నేతలు పిచ్చుకపై బహ్మాస్త్రం ప్రయోగిస్తున్నారన్న చర్చ జిల్లాలో జరుగుతోంది. చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లపై వేధింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయని చెప్పుకుంటున్నారు. గజపతినగరం మండలం రామన్నపేట పాఠశాలలో శానిటరీ వర్కర్ తొలగింపు, అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు మానాపురం సౌజన్య తొలగింపునకు ఇటీవల జరిగిన రాజకీయ విన్యాసాలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. ఈ విషయంలో పార్టీ అనుయాయుల ప్రయోజనాల కోసమూ, రాజకీయంగా సంతృప్తి పర్చేందుకు, మంత్రి సహా గజపతినగరానికి మండలానికి చెందిన ఓ నాయకుడు ఎంతో 'మక్కువ' చూపించారనే విమర్శలు గుప్పు మంటున్నాయి. గత నెల 30న సౌజన్యను తొలగించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం పొందారన్నది మంత్రి అనుచరుల అభియోగం. అందుకు తగ్గట్టే అధికారులు కూడా నివేదికను తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపి తొలగింపు చర్యలు చేపట్టారు. కానీ, రాజకీయ కక్ష సాధింపుతో తనను తొలగించారని బాధితురాలితోపాటు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకుల వాదన. జనంలో కూడా ఇదే రకమైన చర్చ నడుస్తోంది. అంతపెద్ద మంత్రి ఇంత చిన్న ఉద్యోగిపై అధికారం ప్రయోగిస్తారా? అంటూ మరికొంతమందిలో సందేహాలు వ్యక్తమౌతున్నాయి. మంత్రిగా ఇలాంటి పెద్దపెద్ద పనులు కూడా చేస్తున్నారా...! అంటూ వ్యంగ్యస్త్రాలు కురిపించినవారూ లేకపోలేదు. ఈ విషయం కాస్త అటుంచితే, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సౌజన్య అంగన్‌వాడీ సహాయకురాలిగా చేరారనేది అధికార పార్టీ నాయకులు సహా తొలగింపు ప్రక్రియలో అధికారులు చేస్తున్న వాదన. వాస్తవానికి ఈ వాదన ఇప్పటిది కాదు. రెండేళ్ల క్రితం ఇదే గ్రామం నుంచి ఇదే పోస్టుకు దరఖాస్తు చేసుకున్న ఓ మహిళ సౌజన్యపై నాటి కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. సౌజన్య తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందారని, ఆమె రామన్నపేటలో లేదనేది అందులో సారంశం. నాటి ఫిర్యాదుపై అప్పటి గజపతినగరం సిడిపిఒ, స్థానిక సూపర్‌వైజర్ విచారణ జరిపిన తరువాతే సౌజన్యను కొనసాగించారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక పాత ఫిర్యాదును మరోసారి తెరపైకి తెచ్చారు. ఇప్పుడు తొలగింపునకు 'మక్కువ' చూపుతున్న నేత అప్పట్లో వైసిపిలో ఉన్నారు. అప్పట్లో మంత్రిగారూ ఆ పార్టీలోనే ఉన్నారనుకోండీ అది వేరే సంగతి. బహుసా అందుకే అప్పట్లో ఏమీ చేయలేకపోయారేమో అని జనం చర్చించు కుంటున్నారు. విద్యార్హత లేనివారిని నియమించినప్పుడు నాడు అధికార పార్టీలోనే ఉన్న ఆ నేతలు ఎందుకు మిన్నకుండిపోయారు? పోనీ, నాడు తప్పుడు నివేదికలు సమర్పించి, సౌజన్య నియామకానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోగలరా? అని జనం ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మంత్రి లేదా ఆయనకు సన్నిహితంగా ఉన్నామని చెప్పుకుంటున్న ఆ నేతలకు రైతులు, కార్మికులు, తదితర తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎందుకు పట్టడం లేదు?. అక్రమాల పేరిట అడ్డకట్ట వేయడానికి ఈ చిన్నపాటి గౌరవ వేతనంతో బతుకీడుస్తున్న అంగన్‌వాడీ ఆయానే దొరికిందా? అని జనం నోట వినిపిస్తున్న సందేహాలు. ఇందుకు కారణం లేకపోలేదు. అరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లో మూడు నుంచి ఐదు కేజీలు వరకు అధికంగా తీసుకుంటున్నారని, రైతులు, రైతు సంఘం నాయకులు 20రోజులుగా నెత్తీ నోరూ కొట్టుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో తక్కువ ధరకు కొనేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే వైసిపి హయాంలో రాజకీయ వేధింపులతో ఉద్యోగాలు కోల్పోయిన వారూ లేకపోలేదు. తిరిగి ఉద్యోగంలో చేర్పించాలంటూ అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు.మంత్రిగారి నియోజకవర్గంలోనే ఓలమ్ జీడిపిక్కల ఫ్యాక్టరీలో వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇటీవల ప్రభుత్వం ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవడంతో మరింత మంది జీవనోపాధి కోల్పోయారు. చెరకు ఫ్యాక్టరీల మూత వల్ల ఆ రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. 'చిన్న పరిశ్రమల మంత్రిగా బొబ్బిలి గ్రోత్ సెంటర్, విజయనగరంలోని విటి అగ్రహారం, సారిపల్లి, కంటకాపల్లి వంటి పారిశ్రామికవాడల్లో కొత్త యూనిట్ల స్థాపనకు కృషి చేయవచ్చు. ఇందుకు వందలాది ప్లాట్లు ఖాళీగా ఉండనే ఉన్నాయి' అని జనం చర్చించుకుంటున్నారు. ఆదిశగా మంత్రి ఆలోచించి ఉద్యోగాలు కల్పించాలి తప్ప ఉన్న ఉద్యోగాలను తీసేయడం వల్ల వారి పొట్టకొట్టడం తప్ప ఒనగూరిందేమీ లేదని జనం చర్చించుకుంటున్నారు. ఇటువంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని ఆ పార్టీ నాయకులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుండెపోటుతో మెప్మా ఆర్‌పి మృతి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పట్టణంలోని దేవినగర్‌కు చెందిన మెప్మా ఆర్‌పి మరడాన జయలక్ష్మి (25) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. ఆమె 22వ వార్డులో మెప్మా రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటించే మరణించినట్లు నిర్ధారించారు. మెప్మా సిఒలు పద్మ, ప్రశాంతి, ఈశ్వరరావుతోపాటు ఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది శనివారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. జయలక్ష్మి మృతిపట్ల విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ పరామర్శించారు. జయలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం, మెప్మా అధికారులు ఆదుకోవాలని వారు కోరారు.

మెప్మా ఆర్‌పి జయలక్ష్మి (ఫైల్)

యువజన ఉత్సవాలు వాయిదా

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 31న నిర్వహించనున్న యువజన ఉత్సవాలను వాయిదా వేస్తున్నట్లు జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించిందని తెలిపారు. దీంతో యువజన ఉత్సవాలను వాయిదా వేసినట్లు ఆయన వివరించారు. తదుపరి నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని, వాటిని గమనించి యువత హాజరుకావాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి-వీరఘట్టం

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒపై దాడికి వ్యతిరేకంగా శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎపిఎం కె.రాము, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ డి.వెంకటరమణ, సీనియర్ సహాయకులు ఉదయాన శ్రీనివాస్, జూనియర్ సహాయకులు ఎ.శ్రీకాంత్ పాల్గొన్నారు.

బెల్టుషాపులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి హెచ్చరించారు. శనివారం మండలంలోని లక్నాపురంలో అక్రమ మద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటు సారా తయారీ, విక్రయాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు పోషకాలతో కూడిన వైవిధ్యమైన ఆహారాన్ని అందించాలని కృషి విజ్ఞాన కేంద్రం న్యూట్రిషన్ శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం నర్సిపురం అంగన్వాడీ కేంద్రం-6లో పరాటా, సూప్, మునగ పొడి, అపరాలతో కూడిన బాల్స్ తయారీలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఇకెవైసి పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని దయానిధిపురం, జానుమల్లువలస గ్రామాల్లో చేపడుతున్న పిఎసిఎస్ ఇకెవైసిని ఎంపిడిఒ త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో సభ్యులంతా ఇకెవైసి చేసుకోవాలన్నారు. అనంతరం జానుమల్లువలసలో గోశాలల నిర్మాణ పనులను పరిశీలించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ కేంద్రుక గైసిల గ్రామంలో విద్యార్థులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పి అరుణ, ఎఎన్‌ఎం కళావతి.. విద్యార్థుల బరువు, ఎత్తు, కంటి చూపు, తదితర వాటిని పరీక్షించారు. రక్త పరీక్షలు చేశారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపారు. మండల పరిధిలో కొట్నాన రామినాయుడు వలస సమీపంలో హెల్మెట్ ప్రాముఖ్యత తెలిజేసే ఫ్లెక్సీను శనివారం ఏర్పాటుచేశారు.

31న శ్రీకళాభారతిలో కళాజాతా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్రీకళా భారతిలో ఈనెల 31న కళాజాత నిర్వహించనున్నట్లు కళాభారతి కమిటీ కార్యదర్శి ఎన్. వేణుగోపాల్, బొబ్బిలి మల్టీ టాలెంట్ కన్వీనర్ విజయమోహన్ చెప్పారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా కళా జాతర నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమాని ముఖ్య అతిథిగా లింగిడి లింగిడి పాట గాయకుడు రఘు, డప్పు శ్రీను హాజరవుతారని చెప్పారు. కళా జాతర సాయంత్రం 6 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కలలను ప్రోత్సహించే వారిని సన్మానిస్తామని చెప్పారు.

ఆలిండియా పోటీలకు ఉపాధ్యాయుల ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ

ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. మండలంలోని గుణుపూర్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గౌరీ శంకర్ కబడ్డీ, రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కూర్మాన భాను, సంతకవిటి మండలం మామిడిపల్లిలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న నరేష్ కబడ్డీ పోటీల్లోనూ, పెదవేమలి వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్ ఖోఖోలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల మూడు నుంచి 8 వరకు ఢిల్లీలో జరగబోయే ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున వీరు పాల్గొంటారని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను జిల్లా మానిటరింగ్ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గది, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం, విద్యార్థుల సామర్థ్యాలు, విద్యార్థులు తయారు చేసిన టిఎంలను, వర్క్ బుక్కులను పరిశీలించారు. జిల్లా మానిటరింగ్ టీమ్ సభ్యుల్లో నెల్లిమర్ల డైట్ అధ్యాపకులు ఎం. రామకృష్ణ, వి.భారతి ఉండగా పాఠశాల కమిటీ చైర్మన్ వి.భాస్కరరావు, సిఆర్‌పిలు కోటీశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి వెంట ఉన్నారు.

అందుబాటులో లేని వైద్యులు

అందని వైద్య సేవలు

- గిరిజన ప్రాణాలకు భరోసా కరువు
- ఇదీ నీలకంఠాపురం పిహెచ్‌సి పరిస్థితి

వైద్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ: నీలకంఠాపురం పిహెచ్‌సి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనుల విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఓ వైపు ప్రభుత్వం ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రభుత్వ ఆశయాలకు వైద్య సిబ్బంది తూట్లు పొడుస్తున్నారు. గిరిజనుల ప్రాణానికి భరోసా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. 'ప్రజాశక్తి' పరిశీలనలో ఈ విషయాలన్నీ బయటపడ్డాయి. నీలకంఠాపురం పిహెచ్‌సిని శనివారం 'ప్రజాశక్తి' పరిశీలించింది. పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాలి. కానీ ఒక్కరూ లేరు. ఎంఎల్‌హెచ్‌పి మాత్రమే వైద్యాధికారి గదిలో ఉన్నారు. ఇద్దరు వైద్యులు సెలవు వెళ్లారని, రోగులు ఎవరు వస్తే వైద్యం చేస్తానని ఎంఎల్‌హెచ్‌పి చెప్పడం గమనార్హం. పిహెచ్‌సిలో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు.

సబ్ సెంటర్‌లో ఉండాల్సిన ఎంఎల్‌హెచ్‌పి.. పిహెచ్‌సిలో ఉంటే, ఆమె స్థానంలో అందించాల్సిన సేవలు ప్రజలకు ఎవరు అందిస్తున్నారో అంతుచిక్కడం లేదు. గత పది రోజులుగా అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలతో గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జ్వరపీడితులు ఆర్‌ఎంపిలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆర్‌ఎంపిలు రకరకాల పరీక్షల పేరుతో వేల రూపాయలు గిరిజనుల నుంచి దోచుకుంటున్నారు. దీంతో వారు ఆరోగ్యపరంగా, ఆర్థికంగా చితికిపోతున్నారు.

గిరిజన ప్రాంతానికి తలమానికంగా ఉంది నీలకంఠాపురం పిహెచ్‌సి. సుమారు వంద గిరిజన గ్రామాల్లో ఎవరికి ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఇక్కడికే వస్తుంటారు. 24 గంటలూ అందుబాటులో ఉంటూ సేవలందించాల్సిన వైద్యులే అందుబాటులో లేకపోతే గిరిజనులకు వైద్యం ఎలా అందుతుందన్నది ప్రశ్న. అత్యవసర సమయంలో, ప్రమాదాలు సంభవించినప్పుడు గిరిజనుల ప్రాణాలు గాలికి వదిలేయడమే తప్ప వైద్యానికి భరోసా కనిపించడం లేదు. ఇద్దరు వైద్యులు ఒకేసారి సెలవు పెట్టి వెళ్లిపోవడం, ఎంఎల్‌హెచ్‌పి వైద్యం చేయడంపై రోగులు, వారి సహాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పట్టాలు ఎప్పుడిస్తారు?

రెవెన్యూ సదస్సులో అధికారులను నిలదీసిన గిరిజనులు


పాచిపెంట, సాలూరులో వినతులు అందిస్తున్న గిరిజనులు, సిపిఎం, గిరిజన సంఘం, వ్యకాస నాయకులు

ప్రజాశక్తి-పాచిపెంట

దశాబ్దాలుగా సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఎప్పుడిస్తారని గిరిజనులు అధికారులను నిలదీశారు. శనివారం మండలంలోని కుడుమూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు కొర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వే నెంబర్ 48లో 782 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి, రెండేళ్లు గడిచినా పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. తాతల కాలం నుండి సాగు చేస్తున్న భూములను గిరిజనులకు నేటికీ అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారని, దీని కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా సాగు చేస్తున్న గిరిజనులు సుకురు గంగయ్య, కొర్ర కళ్యాణ్, సుకురు ఎర్రయ్య, నారాయణమ్మ, గెమ్మెల గోపాల్ వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి చదల రాజు, తదితరులు పాల్గొన్నారు

గిరిజన భూసమస్యలు పరిష్కరించాలి

సాలూరురూరల్ : గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వి.సుందరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి అధికారులను కోరారు. శనివారం మండలంలోని బాగువలస నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎన్‌వి రమణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో ముందస్తుగా దండోరా వేయించాలని కోరారు. గతంలో మండలంలో అటవీ, బంజరు భూములకు పట్టాలు ఇస్తామని హామీనిచ్చారని, నేటికీ అమలు కాలేదని చెప్పారు. వెంటనే గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి.నాగేశ్వరరావు, మెల్లిక కోమన్న, జి.శ్రీను, వంతల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలపై జిఒ ఇవ్వాలి

ప్రజాశక్తి-కొమరాడ

అంగన్వాడీల సమ్మె సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభుత్వం వెంటనే జిఒ విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కొమరాడ, కోటిపాం కాలనీలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ అనురాధ, మంగ అధ్యక్షతన శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం కొన్ని హామీలిచ్చిందని గుర్తుచేశారు. వాటిని నేటికీ పరిష్కరించలేదని చెప్పారు. వెంటనే అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

30న మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-బలిజిపేట

ఈ నెల 30న మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ సామల సింహాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతి ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి స్టూడెంట్ ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్టు, గ్రూప్ ప్రాజెక్టు.. మొత్తం మూడు ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు అవకాశం ఉందని చెప్పారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ప్రాజెక్టులను జనవరి 3న పార్వతీపురంలో జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు పంపిస్తామని తెలిపారు.

30న వ్యర్థాలు తరలించేందుకు వేలం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో కోడి, మేక, చేప అమ్మకందారుల దుకాణాల నుంచి వచ్చిన వ్యర్థాలను సేకరించి, తరలించేందుకు ఈ నెల 30న వేలం వేస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యర్థాలను సేకరించి తరలించడం, మున్సిపల్ కార్యాలయానికి నెలకు రూ.25 వేలు చొప్పున యూజర్ ఛార్జీలు చెల్లించేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 30న మధ్యాహ్నం 12 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, అదే రోజు సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు.

తగ్గిన మలేరియా కేసులు

డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పద్మావతి

రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పద్మావతి

ప్రజాశక్తి-పాచిపెంట

జిల్లాలో గత నెల కంటే ఈ నెల మలేరియా, డెంగీ కేసులు తగ్గాయని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కెవిఎస్ పద్మావతి తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మందుల నిల్వల గది, ల్యాబ్, పేషెంట్లు వార్డు పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. రోజుకు ఒపి ఎంత వస్తుందనేది గమనించారు. ఇంటి వద్ద కాకుండా ఆసుపత్రి వద్ద ప్రసవాలు జరిగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత నివారణకు సంబంధించి గ్రామ సచివాలయ పరిధిలో కమిటీలు నియామకం చేపట్టామన్నారు. రక్తహీనత కలిగిన గర్భిణులు, బాలింతలను గుర్తించి, వారి పట్ల ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవిచంద్ర ఉన్నారు.

సంక్షేమ నేస్తాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు పారినాయుడు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సమాజంలో సంక్షేమ నేస్తాల పాత్ర కీలకమని జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. తోటపల్లి అన్నపూర్ణేశ్వరీ గిరిశక్తి సమావేశ మందిరంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆరు పంచాయతీల పరిధిలోని 60 మంది సంక్షేమ నేస్తాలకు రెండు రోజుల శిక్షణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై గ్రామాల్లో మిగతా కుటుంబాలను చైతన్యపరిచి, సంక్షేమ ఫలాలు పొందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ ఎపిడి రెడ్డి సురేష్ నాయుడు మాట్లాడుతూ పోడు పట్టా (ఆర్‌ఒఎఫ్‌ఆర్) కుటుంబాలకు 150 రోజులు పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటల్లో 20 రకాల పండ్ల మొక్కలు సరఫరా చేయడానికి రైతులు ముందుకు వస్తే అంచనా వేసి పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ పిఎంయు జట్టు సభ్యులు కళ్యాణ్ రామ్, కృష్ణప్రసాద్, లోకేష్, కురుపాం ఎపిఎం వెంకటరమణ, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్ పాల్గొన్నారు.

'వేదాంత' విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు

ప్రజాశక్తి- పార్వతీపురం

వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రశంసించారు. జాతీయ స్థాయి ర్యాంకులతో దేశంలోని పలు ఐఐటిల్లో సీట్లు సాధించిన విద్యార్థులు.. కలెక్టర్‌ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించి, విద్యార్థులకు గ్రూపు సర్వీసుల్లో విజయం సాధించటానికి కొన్ని మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో వేదాంత జూనియర్ కాలేజ్ చీఫ్ మెంటర్ డాక్టర్ పెంట అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సైబర్ నేరాలపై అప్రమత్తం

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ కళాధర్

ప్రజాశక్తి వీరఘట్టం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి.కళాధర్ విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని రేగులపాడు వద్దనున్న కెజిబివి విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని చెప్పారు. రకరకాల ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టే విధంగా పోస్టులు వస్తున్నాయని, దీనిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-సీతంపేట

బాల్యవివాహాలు అరికట్టాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. శనివారం ఐసిడిఎస్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సీతంపేటలోని సామాజిక భవనంలో కిశోర వికాసంపై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో ఐసిడిఎస్ ద్వారా 18ఏళ్లలోపు బాలికలు చదువుపై దృష్టి పెట్టే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకోకూడదని చెప్పారు. కార్యక్రమంలో సిడిపిఒ పి.రంగలక్ష్మి, డిఆర్‌పి పి.శ్రీధర్, సూపర్వైజర్లు ఎస్.విషమ్మ, జి.గౌరీ, ఎం.లావణ్య, జియో మునిసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కందికొత్తల ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ గ్రామంలో శనివారం నిర్వహించిన కందికొత్తల ఉత్సవాల్లో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. తోటి గిరిజనులతో కలిసి థింసా (జట్టు కట్టు) నృత్యం చేశారు. ఈ పండగలో గిరిజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే కందికొత్తల ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ , ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ఆదివాసీ నాయకులు నాగభూషణం, పత్తిక శంకర్రావు, కొండలరావు, చలపతిరావు, తిరుపతిరావు, శివరామకృష్ణ డుమ్మంగి సర్పంచి క్రాంతి కుమార్, కొండలరావు, చలపతి, ఊయక తిరుపతి పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభను

విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

జనవరి ఐదో తేది నుంచి కాకినాడలో జరిగే యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు కోరారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో స్వర్ణోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు తీళ్ళ మధుసూదన రావు, సహాధ్యక్షులు అంది పోలినాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూరాడ ఆదినారాయణ, మండల నాయకులు జాగాన సింహాచలం, వెన్నెల తవిటి నాయుడు, ఓలేటి గిరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.